

పసుపు, స్పైసిస్ బోర్డు ఒక్కటే..
పసుపు బోర్డు, స్పైసిస్ బోర్డు ఒక్కటేనని దీంతో రైతులకు లాభాలు చేకూరుతాయని ఎంపీ అర్వింద్ అన్నారు.
- 8లో ▸



గుట్టలు మాయం
రెవెన్యూ అటవీశాఖాధికారుల సమన్వయ లోపం కారణంగా విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.3 /15.2
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం చలి పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్‌అర్బన్ : మోడల్ స్కూల్లో ప్రవేశాలకు ఈనెల 22 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 16 న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఏప్రిల్ 16న మధ్యాహ్నం 2 గంటల పరీక్ష ఉంటుందన్నారు.

జీజీహెచ్‌లో త్వరలోనే క్యాథ్‌ల్యాబ్ సేవలు

● ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్



నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో త్వరలో క్యాథ్‌ల్యాబ్ సేవలు అందించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు. బుధవారం విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు వెల్‌నెస్ సెంటర్ మార్పుపై సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాథ్‌ల్యాబ్‌తో సామాన్య ప్రజలతోపాటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు, జర్నలిస్టులకు ఉచితంగా గుండె సంబంధిత చికిత్సలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఉచితంగా యాంజియోగ్రాం, స్టంట్ బైపాస్ తదితర సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు రవీందర్, బోజాగౌడ్, ఆశయ్య సూపరెంటెండెంట్‌తో మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్‌ను జీజీహెచ్‌లో కాకుండా అందరికీ అనుకూలంగా ఉండే ప్రదేశానికి మార్చాలని కోరారు. వెల్‌నెస్ సెంటర్‌ను న్యాల్‌కల్‌రోడ్డు ఈఎస్‌ఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు గత కలెక్టర్‌కు లేఖ రాశామని ప్రతిమారాజ్ తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులతోపాటు తాలూకా బాధ్యులు జగత్ రెడ్డి, రంగయ్య, రంగప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'పోడు' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్ : పోడు భూములకు సంబంధించి దాఖలైన క్లెయిమ్‌లను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, ఫారెస్ట్, మండల పరిషత్ తదితర అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన పలు సమస్యలను అధికారులు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతుల గురించి కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. పోడు భూములకు పట్టా పాస్ బుక్కులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినందున, నిర్ణీత గడువులోపు దాఖలైన క్లెయిమ్‌లన్నింటినీ సమగ్ర పరిశీలన జరిపి పక్షం రోజుల్లోపు పరిష్కరించాలన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హులైన వారి క్లెయిమ్‌లను శనివారం లోపు జిల్లా కమిటీకి అందించాలని స్పష్టమైన గడువు విధించారు. అర్హులైన వారి నుంచి నిర్దేశిత ఆధారాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సేకరించాలని ఎంపీడీఓలు ఆదేశించారు. ఈ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగూరావు, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రవి, రాజేశ్వర్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఒకరు డిబార్

● 818 మంది విద్యార్థులు గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో బుధవారం ఒక విద్యార్థి డిబారైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో బాన్సువాడలోని ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాల పరీక్షకేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒకరు డిబారైనట్లు ఆమె తెలిపారు. ఈ పరీక్షల్లో 10,426 మంది విద్యార్థులకు గాను 9,608 మంది హాజరు కాగా 818 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కంట్రోలర్ అరుణ తెలిపారు.



ఖోజా కాలనీలోని మున్సిపల్ పార్కు స్థలం

భూ మాయాజాలం..

- రూ.కోట్ల విలువైన భూమి కాజేసేందుకు స్కెచ్
- నిబంధనలకు విరుద్ధంగా భూమి బదిలీకి మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం
- పార్క్ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి మంజూరైన నిధులు హాంఫట్
- ఇదీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వ్యవహారం

నగరంలోని ఖోజా కాలనీలో గల రూ. కోట్ల విలువైన మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని కాజేసేందుకు ప్రణాళిక ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మున్సిపల్ పార్కుకు కేటాయించిన ఈ స్థలాన్ని బదిలీ కోసం 2016లో కౌన్సిల్‌లో ప్రతిపాదన పెట్టగా తిరస్కరణకు గురైంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డులో మున్సిపల్ పార్క్ కోసం కేటాయించిన రూ.కోట్ల విలువైన మైదానాన్ని కాజేసేందుకు కొందరు స్కెచ్ వేస్తున్నారు. ఖోజా కాలనీలోని ప్లాటినం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలోని 2,666.88 చదరపు గజాల భూమిని హాంఫట్ చేసేందుకు పకడ్బందీగా పావులు కదపడం గమనార్హం. ఇప్పటికే బోధన్ రోడ్డులోని మైనారిటీలు ఉంటున్న వార్డుల్లో పార్కులు, ఆటస్థలాలు, కమ్యూనిటీ భవనాలు, ఓపెన్ జిమ్‌లు, గ్రంథాలయాలు లేవు. ఈ నేపథ్యంలో ఖోజా కాలనీలో ఉన్న విలువైన మున్సిపల్ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా భూమి బదిలీ కోసం రంగం సిద్ధం చేయడంపై పలువురు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు.

■ 1993 నుంచి వదిలేశారు..

ఖోజా కాలనీలో 1993లో 2,666.88 చదరపు గజాల స్థలాన్ని లేఅవుట్ పార్క్ స్థలంగా కేటాయించారు. అప్పటి నుంచి అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఇక్కడ చదరపు గజం రూ.70 వేల వరకు ఉన్నట్లు అంచనా. ఈ మైదానం చుట్టూ ప్రహరీ కట్టేందుకు 13వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయించారు. ఆర్థిక సంఘం నుంచి మొత్తం 25 చోట్ల వివిధ పనులకు నిధులు కేటాయించినట్లు కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. 24 చోట్ల పనులు పూర్తి కాగా ఈ ఒక్క చోట ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణ పనులు చేయలేదు. ఇందుకోసం కేటాయించిన రూ.15 లక్షల నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. కాగా 2016 ఆగస్టు 27న అప్పటికే నిర్మాణం పూర్తయిన ప్లాటినం హౌసింగ్ సొసైటీ మసీదు కోసం ఈ స్థలాన్ని కేటాయించేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో భూమి బదిలీ ప్రతిపాదన పెట్టారు. బదులుగా ప్రాధాన్యత లేని చోట స్థలం ఇచ్చేందుకు నిర్ణయించారు. అప్పటి కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖైసర్ ఈ భూమి బదిలీ ప్రతిపాదనను వ్యతిరేకించడంతో తిరస్కరణకు గురైంది.

పునఃపరిశీలించాలని..

మరోసారి 2019 ఫిబ్రవరి 5న భూమి బదిలీ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కౌన్సిల్‌లో పెట్టారు. ఈ క్రమంలో 2019 ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో భూమి బదిలీ చేస్తూ తీర్మానం చేశారు. సయ్యద్ ఖైసర్ అప్పటి సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) సత్యనారాయణకు 2019 జూన్ 10న ఫిర్యాదు చేశారు. ఈ భూమి బదిలీ ప్రక్రియకు బ్రేక్ పడింది. అయినప్పటికీ, కేటాయించిన నిధులున్నప్పటికీ ప్రహరీ మాత్రం నిర్మించలేదు. నేషనల్ అథ్లెటిక్ మెడలిస్ట్, కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖైసర్ మాట్లాడుతూ ఈ స్థలాన్ని బదిలీ చేయడం చట్టవిరుద్ధమన్నారు. స్థలాన్ని మైనారిటీల క్రీడాస్థలం కోసం ఉపయోగించాలి. విద్య, వైద్య అవసరాల కు తప్ప ప్రభుత్వ స్థలాన్ని ఇతర అవసరాలకు బదిలీ చేయకూడదన్నారు. ఎంఐఎం, బీఆర్ఎస్ నాయకులు కలిసి భూమిని కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 2014లో మంజూరైన రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మించాలన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చిత్రా మిశ్రాను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్‌కు స్పందించలేదు.



సయ్యద్ ఖైసర్

మాయమాటలు నమ్మొద్దు



సోన్‌పేట్‌లో హనుమాన్ ఆలయ శిఖరానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- ఎంపీ అర్వింద్‌ను ఉద్దేశిస్తూ మంత్రి ప్రశాంత్‌రెడ్డి విమర్శనాస్త్రాలు

బాల్కొండ : నిధులు తేకుండా, అభివృద్ధి పనులు చేపట్టకుండా మాయమాటలు చెప్పేవారిని నమ్మవద్దని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మెండోరా మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గెలిచిన ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తెస్తానని మాయమాటలు చెప్పిన ఓ నాయకుడు ఎక్కడికి పోయాడంటూ పరోక్షంగా ఎంపీ అర్వింద్‌ను ఉద్దేశించి విమర్శించారు. అభివృద్ధికి నిధులు తీసుకురాకుండా మతం పేరుతో యువకులను రెచ్చగొడుతున్నారని పరోక్షంగా బీజేపీ నాయకులను విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇదివరకే 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయన్నారు. పల్లెల్లో ప్రజలకు వైద్యం చేరువకావాలని నియోజకవర్గంలో మరో 36 పల్లె దవాఖానాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి పల్లె దవాఖానాలో ఓ ఎంబీబీఎస్ వైద్యుడు వైద్యసేవలు అందిస్తారన్నారు. పనిచేసే వారికే ఓట్లు వేసి పట్టం కట్టాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పిన అర్వింద్‌కు ఓట్లు వేసి మోసపోయారన్నారు. నియోజకవర్గ ప్రజలు పనిచేసే వారికే వారికి పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తలారి గంగాధర్, వైస్ ఎంపీపీ సరస్వతి, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో సుదర్శనం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యాన్ని సహించం

- నగరవాసులకు అందుబాటులోకి మరిన్ని సదుపాయాలు
- క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిని పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్



మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల, కలెక్టర్ తదితరులు

నిజామాబాద్ నాగారం : నగర ప్రజలకు త్వరలోనే మరిన్ని ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని అర్బన్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టరేట్ సమీపంలో నిర్మిస్తున్న ఐటీ హబ్‌ను సందర్శించారు. పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఐటీ హబ్‌కు చేరువలో నిర్మిస్తున్న దుబ్బ వైకుంఠధామం పనులను, నగర పాలక సంస్థ నూతన భవన సముదాయాన్ని, ఖలీల్‌వాడి, హైమదీబజార్ సమీకృత వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ యార్డులు, కోటగల్లీ, ఖిల్లా, అర్సపల్లి వైకుంఠధామాల పనులను, రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు. నిధులు అందుబాటులో ఉన్నందున నెలన్నర లోపు పనులన్నీ పూర్తి కావాన్నారు. ప్రతిచోటా పచ్చదనం కనిపించాలన్నారు. పనుల నాణ్యతను పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గణేశ్ గుప్తా మాట్లాడుతూ రూ. కోట్ల వ్యయంతో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు మార్చి నెలాఖరు లేదా ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని, మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకుంటామన్నారు. మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా వెంట ఉన్నారు.



నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ తీరు

నగరంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పనుల్లో ఏర్పడిన లోపాలు, అసంపూర్తి నిర్మాణాల వల్ల నగర వాసులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పనుల్లో భాగంగా పగులగొట్టిన రోడ్లను మరమ్మతులు చేయడంలో చూపిన నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక చాలా చోట్ల రోడ్లు కుంగిపోయాయి. వాహనాలు దిగబడుతున్నాయి. – నిజామాబాద్ నాగారం - 10లో..

అద్దెకు మడిగెలు సిద్ధం

- జెడ్పీ ఆవరణలో 15 దుకాణాలు
- ఆదాయం సమకూర్చుకునేందుకే ప్రత్యేకంగా నిర్మాణం



నిజామాబాద్‌నాగారం : జిల్లా పరిషత్ ఆదాయం సమకుర్చుకునేందుకు తమ ఆధీనంలో ఉన్న వనరులను వినియోగించుకుంటోంది.ఇందులో భాగంగా అద్దెకు ఇవ్వడానికి నగరంలోని రైల్వే కమాన్ సమీపంలో ప్రధాన రహదారికి ఎదురుగా జెడ్పీ ఆవరణలో దుకాణ సముదాయాలు నిర్మించారు. రూ. 80 లక్షలతో 15 దుకాణాల నిర్మాణం పూర్తయ్యింది.

ప్రత్యేక రాష్ట్ర వచ్చిన తర్వాత..

జిల్లా పరిషత్‌కు ఉమ్మడి రాష్ట్రంలో నిధుల వరద కొనసాగింది. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత జిల్లా పరిషత్‌కు నిధులు లేకుండా పోయాయి. మొక్కుబడిగా ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నాయి. దీంతో జిల్లా పరిషత్ ఆవరణలో దుకాణాలు నిర్మించి ఆదాయం సమాకూర్చుకోవడానికి జెడ్పీ చైర్మన్, జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రభుత్వ అనుమతితో రూ. 80 లక్షల నిధులను మంజూరు చేయించుకున్నారు. 6 నెలల కాలంలో 15 దుకాణాలు నిర్మించారు. ఇప్పుడు వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా జిల్లా పరిషత్‌కు ఆదాయం రానుంది. ఒక్కో దుకాణానికి సుమారుగా రూ. 10 వేల పైన కిరాయికి ఇవ్వనున్నట్లు సమాచారం. అద్దెకు సంబంధించిన విధి విధానాలను త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.

టెండర్ల ద్వారానే కేటాయింపు..

దుకాణాలను టెండర్ల ద్వారానే కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం దుకాణాలను అర్హులకు కేటాయిస్తామని చెబుతున్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి డీడీ కట్టాలని, దరఖాస్తులు స్వీకరించిన తర్వాత టెండర్ పద్ధతిలో అర్హులకు దుకాణాలు అందిస్తామన్నారు.

"త్వరలోనే టెండర్లు..



జిల్లా పరిషత్ ఆవరణలో 15 దుకాణాలను నిర్మించాము. వీటికి అతి త్వరలోనే టెండర్ల ప్రక్రియ ద్వారా దరఖాస్తులు తీసుకుంటాం. నిబంధనల ప్రకారమే దుకాణాలను అర్హులకు అందిస్తాం. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. అతి త్వరలోనే దుకాణాలకు టెండర్లు తీసుకోవడం జరుగుతుంది.
– దాదన్నగారి విఠల్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్

'పచ్చి' మెలిక..

- పసుపు కొనుగోళ్లలో వ్యాపారుల ఎత్తుగడ
- ఖరీద్దారులు పేమెంట్లు ఇవ్వడం లేదని కమీషన్ ఏజెంట్ల గగ్గోలు
- ఇరువురితో చర్చలు జరిపిన మార్కెట్ కమిటీ అధికారులు
- కొనకపోతే చర్యలుంటాయని హెచ్చరిక
- వెంటనే ప్రారంభమైన బీట్లు



వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో చర్చలు జరుపుతున్న మార్కెట్ సెక్రెటరీ వెంకటేశం



చర్చల అనంతరం పసుపు కొనుగోళ్లు

ఇందూరు (నిజామాబాద్ అర్బన్): వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు పసుపు కొనుగోళ్లలో కొత్త ఎత్తుగడ వేశారు. రైతులు తెచ్చిన పంట 'పచ్చిగా' ఉందని మెలిక పెట్టి తక్కువ ధరకు కొంటున్నారు. దీంతో రైతులు నిలువునా మోసపోతున్నారు. మరో పక్క ఖరీద్దారులు తమకు పేమెంట్లు ఇవ్వడం లేదని కమీషన్ ఏజెంట్లు రెండు రోజులుగా కొనుగోళ్లు జరపలేదు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు నిల్వలు పేరు పోయి క్రయ, విక్రయాలకు నిలిచిపోగా, మంగళవారం రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మార్కెట్ యార్డు అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో బుధవారం మార్కెట్ సెక్రెటరీ వెంకటేశం తన చాంబర్‌లో సమావేశమై చర్చలు జరిపారు. ఇరువురి సమన్వయ లోపం కారణంగా మార్కెట్ యార్డుకు పసుపు తెచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మార్కెట్‌కు చెడ్డ పేరు వస్తోందన్నారు. పసుపును కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని, కానీ ఖరీదు చేసిన వ్యాపారులు తమకు 20 రోజులవుతున్నా పేమెంట్లు ఇవ్వడం లేదని కమీషన్ ఏజెంట్లు వాపోయారు. ఇకపై 17 రోజుల్లోగా పేమెంట్లు చేసే విధంగా వ్యాపారులు మార్కెట్ సెక్రెటరీ ముందు ఒప్పందం చేసుకున్నారు. ఇకముందు కొనుగోళ్లలో ఇబ్బందులకు గురి చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని మార్కెట్ కమిటీ అధికారులు హెచ్చరించారు.

చర్చలు కాగానే కొనుగోళ్లు

చర్చలు పూర్తి కాగానే మధ్యాహ్నం 12 గంటల తర్వాత మార్కెట్‌లో పసుపు బీట్లు మొదలయ్యాయి. కమీషన్ ఏజెంట్లు మార్కెట్ ఆఫీసు నుంచి నేరుగా పసుపు కుప్పల వద్దకు వచ్చారు. రెండు రోజులకు సంబంధించిన పంటను బుధవారం ఒక్కరోజే విక్రయించారు. మొత్తం 3,500 లాట్లకు సంబంధించిన 30 వేల బస్తాల పసుపు అమ్ముడుపోయింది. ధర మాత్రం పెరగకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గరిష్ఠ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.4,000, మోడల్ ధర రూ.5,400 వరకు పలికింది. పసుపు పచ్చిగా ఉండడంతో రైతులకు సరైన రేటు దక్కడం లేదు. కాగా, నాణ్యమైన పంటకు సైతం క్వింటాలు రూ.6వేలు మించడం లేదు. తేమశాతం ఎక్కువ ఉంటే వ్యాపారులు తక్కువ ధరను నిర్ణయిస్తున్నారు. రైతులు కూడా నోరు మెదపడం లేదు. తక్కువ రేటుకు కొనుగోలు చేసిన వ్యాపారులు స్టోరేజీ చేసుకుని ధర ఎక్కువగా ఉన్న సమయంలో మార్కెట్‌లో విక్రయించడం పరిపాటిగా మారింది.

"అన్యాయం జరుగుతోంది..



మార్కెట్ యార్డుకు సోమవారం ఉదయం వచ్చాను. పసుపు పచ్చిగా ఉందని కొనలేదు. ఎండబెట్టి రెండు రోజులవుతున్నా ఇంకా పచ్చిగా ఉందని వ్యాపారులు మెలిక పెడుతున్నారు. చాలా తక్కువ ధరకు కొనడంతో రైతులకు అన్యాయం జరుగుతోంది.
– రవి, యువరైతు, వన్నెల్(కె), నందిపేట్ మండలం

రెండ్రోజులుగా కుప్పల దగ్గరే..



పసుపు పంటను తీసుకుని మార్కెట్ యార్డుకు తెచ్చి రెండు రోజులవుతోంది. బీట్లు వేయడం లేదు. రెండు రాత్రులు ఇక్కడే కుప్పల వద్ద పడుకున్నా. ఒక పూట అన్నం తిన్నా. బుధవారం బీట్లు పెట్టి కొంత పంటను కొనుగోలు చేశారు. ఇంకా కొంచెం ఉంది.
– హన్మాండ్లు, రైతు, సిర్గాపూర్, నిర్మల్ జిల్లా

రైతులకు ఇబ్బందులు రానివ్వం..



నమ్మకంతో వ్యవసాయ మార్కెట్‌కు పసుపు పంటను తీసుకువచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల మధ్య తలెత్తిన సమస్య కారణంగా కొనుగోళ్లకు అడ్డంకి ఏర్పడింది. వారితో చర్చించి సమస్యను పరిష్కరించాం. ఇకపై ఎలాంటి ఇబ్బందులుండవు. రైతులు మాత్రం ఎండబెట్టిన పసుపునే మార్కెట్‌కు తేవాలి. పచ్చి పంట తెచ్చి తక్కువ ధర వచ్చిందని బాధ పడొద్దు.
వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, వ్యవసాయ మార్కెట్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం : ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం వైస్ చైర్మన్ రజిత ఎల్లయ్య యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఎక్స్‌ఆఫీసియోగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, రైతు బీమా దరఖాస్తులు ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని, ఉంటే వాటిని ప్రభుత్వానికి పంపాలన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖాధికారికి ఆదేశించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత గ్రామ పంచాయతీలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. ఇసుక క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, అక్రమ రవాణా జరుగకుండా చూసుకోవాలని మైన్స్ శాఖాధికారికి ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో చందర్‌నాయక్, డీపీవో జయసుధ, మైన్స్ ఈఈ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఈ రవీంధర్, జెడ్పీటీసీ సభ్యులు రుద్రూర్ నారోజి గంగారాం, మోర్తాడ్ రవి, వ్యవసాయ శాఖ, ఫారెస్ట్, ఉద్యానవన శాఖ, వెటర్నరీ శాఖ, విద్యుత్ శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 41 పరీక్షా కేంద్రాల్లో ఉదయం మొత్తం 3,632 మంది విద్యార్థులకు గాను 3,378 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2,955 మందికి 2,767 మంది హాజరైనట్లు ఇంటర్ జిల్లా విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. జనరల్ విద్యార్థులకు 35, వొకేషనల్ విద్యార్థులకు ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య,కనక మహాలక్ష్మి, హైపవర్ కమిటీ సభ్యుడు రజియుద్దీన్, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్



ఖలీల్‌వాడి: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజు అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుస్సాపూర్ శంకర్ అన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం ఎస్టీ రెసిడెన్షియల్ ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్, ఆనంద్, మేఘవత్ దినేష్‌నాయక్, లాలూనాయక్, సాయిలు, పాండు, రమేష్‌నాయక్, లాల్ సింగ్, సంతోష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పనులు పునఃప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి.'సాక్షి' దినపత్రికలో ఈ నెల 06న 'బడి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పాఠశాల పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం పాఠశాల భవనం పనులు ప్రారంభమయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బాన్సువాడ టౌన్‌: బీర్కూర్ మండలం దామరంచ మంజీర నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 19 ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. అనుమతులు లేకుండా మంజీర నుంచి ఇసుకను బాన్సువాడకు తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని చెప్పారు. అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

గుట్టలు మాయం!

- పోడు హక్కుల కోసం అడవులకు కీడు
- పట్టించుకోని అధికారులు



పోడు కోసం నరికి వేసిన చెట్లు



చదును చేసిన అటవీ భూమి

ఇందల్వాయి: రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఇందల్వాయి మండలం గన్నారం రెవెన్యూ శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న 1223 సర్వే నంబరులో భూబకాసురులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ గుట్టలను చదును చేస్తున్నారు. పదుల ఎకరాల్లో పచ్చని చెట్లను నరుకుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అంతే లేకుండా పోతుంది. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 1223 సర్వే నంబరులో మొత్తం 228.22 ఎకరాల భూమి ఉంది. తూపంల్లి కప్పల వాగు, డొంకల్ చిన్నరాయ చెరువు, గన్నారం జోర్‌నాథ్ చెరువు, ఇందల్వాయి ఎర్రకుంట, ముత్యాలవాగులో అటవీ భూమి పోయినందుకు 2001లో అప్పటి కలెక్టర్ శశాంక్ ఆధ్వర్యంలో 1223 సర్వే నంబరులో అటవీ శాఖకు 193 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇప్పటి వరకు అధికారుల నిర్లక్ష్యంతో కేటాయించిన భూమి అధికారికంగా అటవీ శాఖ ఆధీనంలోకి రాలేదు. జాయింట్ సర్వే నిర్వహించినా హద్దులు గుర్తించడం లేదు.

సమన్వయ లోపం

అటవీశాఖకు కేటాయించిన 193 ఎకరాలు పోను మిగతా 35.22 ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉండగా హద్దులు తేలని భూముల్లో రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండా రెట్టింపు భూమికి పట్టాలు కేటాయించారు. అంతేకాకుండా మరింత విస్తీర్ణానికి కొత్తవారి పేర్లను ధరణిలో నమోదు చేశారు. దీంతో పట్టా పుస్తకాలు ఉన్నవారు, డిజిటల్ సంతకాలు కాకుండా రికార్డుల్లో ఉన్నవారు ధరణి రికార్డులను అడ్డు పెట్టుకొని పోడు హక్కులు వస్తాయన్న ఆశతో వాల్టా చట్టాలను తుంగలో తొక్కుతూ ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కొండలని, గుట్టలని చదును చేస్తూ ప్రకృతిని నాశనం చేస్తున్నారు.

వివాదాస్పదంగా అధికారుల తీరు

అటవీ శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో వేల సంఖ్యలో చెట్లు నరికివేతకు గురవుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తుంది. తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిలో ఒక వేప చెట్టు పీకేస్తేనే వాల్టా చట్టం అంటూ 45 వేలు జరిమానా విధించిన రేంజ్ అధికారి, వేల సంఖ్యలో చెట్లను నరుకుతున్నా వారికి సాదా సీదా జరిమానాలతో సరిపెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా భూ ఆక్రమాలను అడ్డుకొని విలువైన అటవి భూములను కాపాడాలంటూ పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అటవీ, రెవెన్యూ శాఖ అధికారులను సంప్రదించగా సదరు భూమి తమది కాదంటే తమది కాదని సమాధానం ఇవ్వడం గమనార్హం.

పసుపు, స్పైసిస్ బోర్డు ఒక్కటే

- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్‌: పసుపు బోర్డు, స్పైసిస్ బోర్డు ఒక్కటేనని, దీంతో పసుపు రైతులకు మంచి ఫలితాలు వస్తాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లోని ఓ గార్డెన్స్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు ఆలూర్ గంగారెడ్డి కూతురు విజయభారతి బీజేపీలో చేరిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజయ భారతికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఒకప్పుడు అభివృద్ధి కార్యక్రమాలలో హాజరు కావడానికి ఆలూర్‌కు రానివ్వకుండా కొందరు అడ్డుకుంటే ఇప్పుడు అదే ఆలూర్ గ్రామ ప్రజలు బీజేపీలో చేరడానికి తన వద్దకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలను బెదిరింపులతో కట్టడి చేయలేరన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయ మని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమని విమర్శించారు. మున్సిపాలిటీలో విలీనం అయిన మామిడిపల్లి అభివృద్ధికి పది కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. లోక భూపతిరెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, పల్లె గంగారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, కంచెట్టి గంగాధర్, పుప్పాల శివరాజ్, జీవీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న విజయ భారతి

'రాజమ్మతండా' జీవన విధానంపై ఆరా

రామారెడ్డి: మండలంలోని రాజమ్మతండా ప్రజల జీవన విధానంపై సాక్షి పత్రికలో వచ్చిన కథనంతో పలువురు తండాను సందర్శిస్తున్నారు. బుధవారం వరంగల్ జిల్లా నుంచి రిటైర్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు తండా సందర్శించి, వారి జీవన విధానం, మినరల్ వాటర్‌కు బదులుగా బోరు నీళ్ల తాగడం ఆరా తీశారు. వారికి వచ్చే వ్యాధులను తెలుసుకున్నారు. సాక్షి పేపర్లో చదవి రాజమ్మతండాకు వచ్చినట్లుగా సదరు వ్యక్తులు తెలిపినట్లు రాజమ్మ తండాకు చెందిన గోపాల్‌నాయక్ చెప్పారు. తమ జీవన విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా పరిచయం చేసిన 'సాక్షి'కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేక విధానాలు

బోధన్ రూరల్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే హాత్ సే హాత్ జోడో కార్యక్రమం చేపట్టామని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలం బండర్‌పల్లి, రాంపూర్, కల్దుర్కి గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందేశాన్ని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించారు. తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిన బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు రూ.లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, తాహర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం

ధర్పల్లి: తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందుండి పోరాడుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో గెలుపొంది ప్రభంజనం సృష్టిస్తామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దుల్ తండా, హోన్నాజీపేట్ గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర చేపట్టారు. రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ గెలుపొందిన వెంటనే రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అనంతరం మద్దుల్ తండాలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, బాలరాజ్, బాలనర్సయ్య, చెలిమెల నర్సయ్య, శ్రీధర్‌గౌడ్, సుభాష్, రవి పాల్గొన్నారు.



హోన్నాజీపేట్‌లో మాట్లాడుతున్న భూపతిరెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సహజం

తెయూ(డిచ్‌పల్లి): క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి రవీందర్ అన్నారు. మూడు రోజులుగా తెయూ క్యాంపస్ మైదానంలో జరుగుతున్న తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. టోర్నీ విజేతగా తెయూ కళాశాల జట్టు, రన్నరప్‌గా ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల జట్టు నిలిచినట్లు వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. వీసీ డి.రవీందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. పీఆర్‌వో ఎండీ జమీల్ అహ్మద్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న వీసీ రవీందర్

రంగురంగుల కూరగాయలు



ఆకుపచ్చ రంగులో క్యాలీఫ్లవర్



గులాబీ రంగులో ఉన్న ముల్లంగి



పసుపు రంగులో ఆకట్టుకుంటున్న క్యాలీఫ్లవర్



పసుపు రంగు క్యాలీ ఫ్లవర్, గులాబీ కలర్ ముల్లంగి, వంకాయ రంగు గోబిగడ్డ.. ఎంటీ ఈ రంగుల్లో ఆయా కూరగాయలు అనుకుంటున్నారా.. అవును నిజామాబాద్ మార్కెట్‌లో వివిధ రంగుల్లో కాయకూరలు ఆకట్టుకుంటున్నాయి. కొందరు వ్యాపారులు సిర్‌పూర్, కాగజ్‌నగర్ నుంచి రంగు రంగుల కూరగాయలను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. వీటిని ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు అమ్మకందారులు చెబుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



లాల్‌సాట్ తోటకూర



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

యువతి అదృశ్యం

పెద్దకొడప్‌గల్‌: పెద్దకొడప్‌గల్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఏఎస్సై రాములు తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో పడుకున్న యువతి మంగళవారం తెల్లవారుజామున లేచే సరికి కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ముగిశాయి. బుధవారం సాయంత్రం వీసీ రవీందర్ క్యాంపస్ క్రీడా మైదానంలో కబడ్డీ ఆడి ఫైనల్ పోటీని ప్రారంభించారు. ఫైనల్‌లో జార్జిరెడ్డి జట్టు, కొమురంభీం జట్టు తలపడగా జార్జిరెడ్డి జట్టు గెలుపొందింది. వీసీ మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడం వల్ల క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి వస్తుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ సంపత్, పీఆర్‌వో జమీల్ అహ్మద్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ కార్యదర్శి శ్రీశైలం, విద్యార్థి నాయకులు ప్రసాద్, సాయిప్రసాద్, సంధ్యారెడ్డి, వెంకటేష్, చిత్రు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న వీసీ రవీందర్

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని శాస్త్రినగర్‌లోని పొల్ట్రీఫారంకు చెందిన షేక్ మౌల ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మౌల మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. డాక్టర్‌ను సంప్రదించగా తాగుడు మానేయాలని సూచించాడు. ఈ క్రమంలో శాస్త్రినగర్ గోదాముల వెనుక మౌల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షేక్ ఫర్జన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో యువకుడి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



గణేశ్ (ఫైల్)

రుద్రూర్ : రుద్రూర్ మండలం సులేమాన్ నగర్ తండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ చేసి అన్నదానం ప్రారంభించాల్సి ఉంది. పాత జెండాలు తొలగించి కొత్త జెండాలు కట్టారు. ఈ క్రమంలో ఐదుగురు ఇనుప రాడ్‌కు కట్టిన జెండాను పైకి లేపుతుండగా 11 కేవీ విద్యుత్ వైరుకు తగిలింది. దీంతో కరెంట్ షాక్ తగిలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మూడ్ గణేశ్ అలియాస్ సుభాష్ (సుబ్బు) (28) మార్గమధ్యలో మృతి చెందాడు. మరో ఇద్దరు హరిశ్ నాయక్, శంకర్ నాయక్‌లు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాన్స్‌కో, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్లలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు.అందులో ఇద్దరు కవలలు. మృతుడు ట్రాక్టర్ డ్రైవింగ్‌తో పాటు దినసరిగా కూలీగా పని చేసేవాడు. ఆనందంగా, హుషారుగా జరుపుకుంటున్న పండగలో సంభవించిన విద్యుత్ షాక్ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.



రోదిస్తున్న మృతుడి భార్య, చిన్నారులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇందల్వాయి: టీవీఎస్ లూనాని కారు వెనక నుండి ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందడంతో పాటు పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన 44వ నంబరు జాతీయ రహదారిపై చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లికి చెందిన పానేటి రాములు, సత్తెవ్వ(30) దంపతులు వారి కుమార్తె ప్రియతో కలిసి కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న కారు వెనక నుంచి లూనాను ఢీకొంది. ప్రమాదంలో సత్తవ్వ ఘటనా స్థలంలోనే మృతి చెందగా ప్రియ కాలు విరగడంతో పాటు, రాములు, కారు డ్రైవర్ సునిల్ పరిస్థితి విషమంగా ఉంది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.



యువకుడి దారుణ హత్య



మోర్తాడ్‌: ఉపాధి నిమిత్తం మోర్తాడ్ వచ్చిన ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బాన్సువాడకు చెందిన కనగల్లు వెంకట్(25) బతుకుదెరువు కోసంమోర్తాడ్ వచ్చాడు. ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ మరో స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వెంకట్ తన మిత్రుడు జల్లా శేఖర్‌తో కలిసి సుంకెట్ రహదారి పక్కన మద్యం తాగాడు. బుధవారం ఉదయం గేదెల కాపరులు వెంకట్ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో శేఖర్ హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు పాల్పడిన ఆయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో నాలుగేళ్ల జైలు

ఖలీల్‌వాడి: గంజాయితో పట్టుబడిన ఒకరికి నిజామాబాదు మొదటి అదనపు సెషన్స్ జడ్జి శ్రీనివాస రావు బుధవారం నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపిన వివరాలు.. నగరానికి చెందిన షేక్ రిజ్వాన్ 1.3 కిలోల గంజాయితో 2018లో పట్టుబడ్డాడు. ఈ కేసులో బుధవారం జడ్జి నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే అదనంగా 6 నెలల శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌లో వైన్ షాపు పక్కన ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద గొడవ జరిగినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ యాజమానితో పాటు ఇద్దరు వర్కర్స్‌కు మధుకర్ అనే వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. దీంతో వారు మధుకర్‌ను తలపై కొట్టారు. మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.